స్కెచ్ :

# మూడు కోణాలు

—జీ. డి.

కోర్టు వాతావరణం.

ఆమె పోలీస్‌వ్యాన్ ఎక్కబోతున్నది. మూడేండ్ల పాప వచ్చి ఆమెకాళ్ళను చుట్టేసుకున్నది. ఆమె ఆ పాప నెత్తుకొని ముద్దుపెట్టుకున్నది ఆ పాపకూడ ఆమెను ముద్దు పెట్టుకుంటూ అంటున్నది. "అమ్మా! తొందరగ రావె".

"అట్లనే" అన్నట్టుగ ఆమె తల వూపింది. ఆమె నోటినుంచి మాటలు వస్తే కళ్ళనుంచి నీళ్లకూడా బయటపడేందుకు సిద్ధంగా వున్నాయ్. అందుకే ఆమె మాట్లాడలేదు.

ఆమె భర్త, పాపను తన చేతుల్లోకి తీసుకుంటూ బుజ్జగిస్తున్నడు. "జైల్లోని అక్కయ్యలకు పాఠాలు చెప్పడం పూర్తికాంగనె-అమ్మ వస్తుంది."

ఆమె వ్యాన్‌లోకి పోయింది. ఆమె వెనుక తుపాకీలు మోస్తున్న ఇద్దరు రక్షకభటులు వ్యాన్ ఎక్కిన్రు.

వ్యాన్ కదిలిపోయింది. వ్యాన్ కనిపిస్తున్నంత సేపూ పాపచేయివూపుతూ వున్నది.

అమ్మ కళ్ళల్లో నీళ్లు ఆ పాపకు కనబడవు.

అమ్మ ఏదో ముఖ్యమైన పనిమీద పోతున్నదని పాప అనుకుంటున్నది. తను కొన్ని రోజులు అమ్మ నుంచి దూరంగా వుంటే బాధేమిటి? అనుకుంటున్నది.

ఆ పాపకు తెలవదు. వాళ్ళ అమ్మ పీడిత ప్రజల ఆవేదనలను పీడక హృదయాలమీద గుద్ది చెప్పిందని; ప్రజాభిప్రాయాన్ని ప్రకటించిందని.

ఆమెను ఆ దేశం శిక్షించింది. ఆ దేశపు రాజ్యాంగం సెక్షన్ 420 (ఎ) ప్రకారం ఆమె రాజద్రోహ నేరం చేసింది.

ఆ అమ్మ (గోర్కీ) పావెల్ అమ్మకు వారసురాలు తన పాపలో ఆమె పావెల్‌ను చూసుకుంటున్నది.

## 2

అది రైల్వే స్టేషన్:

ఆయన రైలు ఎక్కబోతున్నడు పత్రికా విలేఖరులు వచ్చి ఆయనను చుట్టేసిను.

“పావెల్ అమ్మనూ, ఆమె వారసులనూ ఎప్పుడు వదిలిపెడతరు?” అని (అధికారంలో వున్న) ఆయనను అడిగిను.

“వెంటనే వదిలిపెట్టాలె” అన్నడు ఆయన.

“మీ కేసుకూ, వాళ్ళ కేసులకూ సంబంధం లేదా?”.

“అది నాకు తెలవదు వాళ్ళనైతే వదలాలె”.

అధికారంలో వున్నవాడే ‘ఎవరో వదలిపెట్టాలె’ అంటె ఏమిటో విలేకరులకు అర్థంకాలేదు.

ఆయన రైలెక్కిండు· ఆయన వెనుకే తుపాకీలు మోస్తున్న రక్షకభటులు రైలెక్కిను

రైలు కదిలిపోయింది.

ఆయన ఎన్నో ముఖ్యమైన పనుల్లో పోతున్నడని విలేకరులు అనుకుంటున్నరు. పావెల్ అమ్మా తదితరులు కొన్ని రోజులు జైల్లో వుంటే బాధేమిటి? అనుకుంటున్నరు.

వాళ్ళకు తెలుసు: పస్తులు పన్న పనివాళ్ళ తరఫున సాయుధపోరాటం నడిపి సెక్షన్ 420 (ఎ) క్రింద ముద్దాయిగ వున్నవాడు ఆయన-యిదివరలో·

ముద్దాయి కాకముందు ఆయన-ఆ దేశపు ఎన్నికలగురించి మాట్లాడుతూ-పోలింగ్‌బూత్ దగ్గర ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డ పిల్లలను చూచినట్లు చెప్పిండు రైనమెట్లతో తప్ప ఈ వ్యవస్థను కూల్చలేమని ప్రయత్నాలు చేసిండు.

కాలం కలిసి వచ్చింది. అవే ఎన్నికలు ఆయనను అధికారంలోకి తెచ్చినయ్. సెక్షన్ 420 (బి) ప్రకారం ఆయనమీద రాజద్రోహ నేరపుకేసు ఎత్తేసిను. అహింసలో నమ్మకమున్నట్టు ఆయనచేత హామీ ఏమీ రాయించుకోలేదు. రాజ్యాన్ని ఆయనకు అప్పగించిను.

ఆయన జాన్ సుబ్రహ్మణ్యం. క్రైస్తవులూ, బ్రాహ్మణులూ రకరకాల వాళ్ళు కలిసి రాజ్యం చేస్తున్న రాజకీయ పార్టీవాడు.

3

అది భవంతులున్న బజారు.

కొత్త భవనం ఒకటి లేస్తున్నది అక్కడ.

ఆమె కారు ఎక్కబోతున్నది. ఆమె కొడుకు అర్జెంటుగ ఏదో చెప్ప వచ్చిండు: "అమ్మా! పావెల్ అమ్మా, జాన్ సుబ్రహ్మణ్యం మనమీద పగ తీసుకోదా? జాగ్రత్త!"

ఆమె నవ్వింది.

ఆ నవ్వును వర్ణిస్తూ కొన్నాళ్ళ కింద కవులు కవిత్వంరాసి కనకాభిషేకం చేయించుకున్నరు.

"పిచ్చివాడా! మనకేమీ కాదు, భయపడకు."

కారు కదిలిపోయింది.

నిర్మాణంలోవున్న తమ భవనం దిక్కునడిచిండు కొడుకు.

ఆమె మొన్నటిదాకా అధికారంలో వుండె చివరి రోజుల్లో కొడుకును దేశంమీద వదిలింది. ఇద్దరూ కలిసి చేయని ఘోరంలేదు. చివరకు దేశ చరిత్రను వక్రంగా రాయించి కాల నాళికలో భద్రపరచింది కూడఆమె.

సెక్షన్ 420 (ఎ) క్రింద ఆమె రాజద్రోహనేరం చేసినట్టు రుజువైతే, కొడుకుతో కలిసి రాజ్యాంగంలో సెక్షన్ 420 (సి)ని చేర్చి, తనకోసం సెక్షన్ 420 (ఎ)లో సవరణ చేయించింది.

ఆమెకు ఆ దేశప్రజల అజ్ఞానం బాగా తెలుసు.

కొత్తగా అధికారంలోకి వచ్చినవాళ్లు తననుకాని, తన కొడుకును కాని ఏమీ శిక్షించరని ఆమెకుతెలుసు. వాళ్ళు, వీళ్ళు అందరూ ఒకప్పుడు తోడు దొంగలేనని ఆమె మరచిపోలేదు.

శిక్షేమైనా పడినా-వారు చనిపోయేదాకా తీర్పుచెప్పక, చెప్పలేక, ఆ దేశపు రాజ్యాంగం వాళ్ళను రక్షిస్తుంది.

పావెల్ అమ్మ, ఆమె వారసుల విషయం తనకంటె బాగా కొత్తవాళ్ళే చూసుకుంటరన్న నమ్మకం ఆమెకు.

ఆమె గోవులా కనిపించే గోమాయువు. వాళ్ళ జాతిపితకున్న పేరే ఆమెదికూడా. పేదప్రజల రక్తంతో ఎదుపెక్కిన ఎర్ర గులాబీకి వారసురాలు ఆమె; ఎందరినో హతమార్చి, ఎన్నికొంపలో కూల్చిన ఎర్ర త్రికోణ ధారిని కన్న 'వీరనారి'.

---

**కటకటాల్లో కలాలు :**

# కంసుని కంప్యూటర్

—శివసాగర్

కంసునికి
కంప్యూటర్ వుండి
(అలా నవ్వుతారేం ?)
మేనక
హెలికాప్టర్లో క్రిందికి దిగింది,
కురుక్షేత్రంలో
(ప్లీజ్ ! నవ్వకండి)
అణు బాంబులు వాడకపోవటం
(అది శ్రీకృష్ణుని ఆదేశం)
కొంతలో కొంత నయం
లేకపోతే
గుడ్డుగుడిచి పోయేది కదా
భరతుని దేశం !
ఏ మాట కామాట
మనకెప్పట్నుంచో
తంతివుంది, వితంతి వుంది
వితంతువుంది
గండభేరుండం మనజెట్ విమానం
పుష్పక విమానం సార్థకనామం.
మర్చిపోయాను
మన్నించగలరు
కంసునికి కంప్యూటరున్నట్లే
మన వేదాల్లో మార్క్సిజం వున్నదిష.
నమ్మండీ ! నమ్మకపోండి
(మీ కర్మ)
స్వదేశీ పానీయంలో నిషా ఎక్కు-
వయిందని
అనుకుంటే అనుకోండి
నేతులు తాగిన
మన తాతల మూతుల్లో
కావలసినంత
కాక్ టెయిల్ ఫ్లేవర్ !

410